ఉన్నత చదువులు.. ప్రభుత్వ కొలువులు

- బాపట్ల జిల్లాలో ఐలవరం జెడ్పీ ఉన్నత పాఠశాలకు ప్రత్యేక స్థానం
- ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు
- గ్రామంలో ప్రతి ఇంటికీ ఓ ప్రభుత్వ ఉద్యోగి
- ఇక్కడి వర్చువల్ క్లాసుల నిర్వహణకు విశేష గుర్తింపు
- ఆంగ్లంలో అనర్గళంగా మాట్లాడి మాజీ సీఎం వైఎస్ జగన్ ప్రశంసలు అందుకున్న పాఠశాల విద్యార్థిని సాయి నాగశ్రీ



మాజీ సీఎం వైఎస్ జగన్ సమక్షంలో ఆంగ్లంలో మాట్లాడిన విద్యార్థిని సాయి నాగశ్రీ (ఫైల్)

సర్కారు బడులకు పిల్లలను పంపుతున్నామంటే చులకనగా చూస్తున్న రోజులివి. ఆర్థిక స్తోమత సహకరించపోయినా తమ పిల్లలకు ప్రైవేటు బడుల్లో నాణ్యమైన విద్యను అందించేందుకే తల్లిదండ్రులు పరితపిస్తున్నారు. ఇటువంటి రోజుల్లో సైతం ఓ ప్రభుత్వ పాఠశాల అద్భుత విజయాలను నమోదు చేస్తూ విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యాబోధన అందిస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. ఈ పాఠశాలలో చదువుకున్న వారు ఎందరో ఉన్నత విద్యావంతులుగా ఎదిగి గొప్ప ఉద్యోగాల్లో స్థిరపడి పాఠశాల కీర్తిని నలుదిశలా వ్యాపింపజేశారు.

ఐలవరం(భట్టిప్రోలు): మండలంలోని ఐలవరం చైతన్యవంతమైన గ్రామం. ఈ గ్రామంలో ప్రజలు ఎక్కువగా చేనేత వృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. చిన్న బొంబాయిగా ప్రసిద్ధి గాంచిన ఐలవరం ఎంతో మంది మేధావులకు పుట్టినిల్లు. ఇక్కడ ప్రతి ఇంట్లో ఒక ఉద్యోగి కనిపిస్తాడు. లేదంటే వ్యాపారంలోనో, స్వర్ణకార పనిలోనో స్థిర పడ్డవారు ఉన్నారు. ఇటువంటి గ్రామంలో 1981లో నెలకొలిన ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులను అద్భుతంగా తీర్చిదిద్దింది. ఆ తర్వాత జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చెంది ఎందరో విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దింది. ప్రస్తుతం ఈ పాఠశాల పేరు ప్రఖ్యాతులు రాష్ట్ర స్థాయిలోనే మార్మోగుతుందంటే అతిశయోక్తి కాదు.

ఒకప్పుడు ఐలవరంలో హైస్కూల్ ఉన్నప్పటికీ అక్కడ నుంచి 4 కిలోమీటర్లు కాలినడకనో, సైకిల్‌పైనో వచ్చి భట్టిప్రోలులోని టీఎంరావు హైస్కూల్‌లో విద్యార్థులు విద్యాభ్యాసం చేసేవారు. అయితే ప్రస్తుతం భట్టిప్రోలు నుంచే సుమారు 120 మంది విద్యార్థులు ఐలవరం వెళ్లి చదువులు సాగించే స్థితికి చేరుకుంది. ఒకప్పుడు 200 మంది విద్యార్థులు ఉండే ఈ హైస్కూల్‌లో ప్రస్తుతం 425 మంది విద్యార్థులు విద్యాభ్యాసం కొనసాగిస్తున్నారు. గతంలో ఇక్కడ పని చేసిన ప్రధానోపాధ్యాయులు మోటూరు వాసుదేవరావు స్ఫూర్తితో అప్పటి ప్రధానోపాధ్యాయులు కాటూరి లక్ష్మీనారాయణ(బదిలీపై వెళ్లారు), ప్రస్తుత హెచ్ఎంగా వ్యవహరిస్తున్న మాచర్ల మోహన్‌రావు ఉపాధ్యాయుల సమిష్టి కృషితో ఇక్కడి విద్యార్థులు చదువుల్లో సత్తా చాటుతున్నారు. ట్రిపుల్ ఐటీ సీట్లు, ఎన్ఎంఎంఎస్ ఉపకార వేతనాలు, క్రీడల్లో సత్తా చాటుతున్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టిన ట్రిపుల్ ఐటీ కళాశాలలో 2007–2008 నుంచి గత విద్యా సంవత్సరం వరకు ట్రిపుల్ ఐటీలో 59 మంది మెరిట్ విద్యార్థులు సీట్లు సాధించారు. ఎన్ఎంఎంఎస్ ఉపకార వేతనాలకు ఇప్పటి వరకు 157 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఉపాధ్యాయులు ప్రత్యేక బోధన సాగిస్తుండటంతో బాపట్ల జిల్లాలోనే కాక రాష్ట్ర స్థాయిలో ఐలవరం జెడ్పీ పాఠశాల పేరు ప్రఖ్యాతులను సొంతం చేసుకుంది. విద్యార్థులకు స్కైప్, పెన్‌పాల్ ద్వారా ఇంగ్లీష్‌లో బోధన నిర్వహిస్తున్న ఆంగ్లోపాధ్యాయులు, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పచ్చారు హరికృష్ణ కృషి శ్లాఘనీయం.

మాజీ సీఎం వైఎస్.జగన్‌ను మురిపించిన విద్యార్థిని

చుండూరు మండలం యడ్లపల్లి ఏవీఆర్ జెడ్పీ హైస్కూల్‌లో 2022 డిసెంబర్ 21న అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఐలవరం హైస్కూల్‌లో అప్పుడు 8వ తరగతి చదువుతున్న రాయన సాయి నాగశ్రీ ఆంగ్లంలో స్పీచ్‌తో అదర గొట్టింది. సీఎం ప్రవేశపెట్టిన అమ్మ ఒడి కార్యక్రమం ఎంతో బృహత్తరమైనదని, నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయని విద్యార్థిని పేర్కొంది. జగనన్నను ఆదర్శంగా తీసుకుని రాబోయే రోజుల్లో అంతర్జాతీయ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న విద్యార్థులు సత్తా చాటుతారని తన ప్రసంగంలో పేర్కొంది.



వర్చువల్ విధానం ద్వారా నాసా శాస్త్రవేత్తతో మాట్లాడుతున్న విద్యార్థిని

ఉన్నత స్థాయిలో పూర్వ విద్యార్థులు

ఇక్కడ చదివిన ఎందరో పూర్వ విద్యార్థులు ఉన్నత స్థాయిలో స్థిరపడ్డారు. ఈ పాఠశాలలో చదివిన ఐఏఎస్ అధికారి పులిమి బాల సుబ్రహ్మణ్యం, టెలికం ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ (ఐఎఫ్ఎస్) పర్రె మధుసూదనరావు, డీఈ జీఎం పడవల కోటేశ్వరరావు, దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ పడవల నరసింహారావు, ఏపీఎస్ ఆర్టీసీ డీఎం చిట్టిబొమ్మల వెంకటేశ్వరరావు, ఆప్కోలో డీఎంహెచ్‌వోగా పని చేసిన జొన్నాదుల రామాంజనేయులు, ఆర్థోపెడిక్‌గా పనిచేస్తున్న మాచర్ల వెంకట సత్యన్నారాయణ, డీఎంఅండ్‌హెచ్‌వోగా పనిచేస్తున్న పడవల వెంకటేశ్వరరావులు ఈ పాఠశాలల్లో విద్యనభ్యసించిన వారే. భట్టిప్రోలు కథలు పేరుతో బాల్యాన్ని అద్భుతంగా చిత్రించి రాసిన వ్యాసకర్త నక్కా విజయరామరాజు ఈ గ్రామ వాసే. ఈ హైస్కూల్‌లో చదివిన 15 మంది గ్రామ సచివాలయాలలో ఉద్యోగాలను సైతం సాధించారు. క్రీడా రంగంలో జాతీయ, రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్, క్రీడా పోటీల్లో పతకాలు సాధించారు. మరి కొందరు ఉపాధ్యాయులుగా, కొందరు వ్యాపార, రాజకీయ రంగాల్లో స్థిరపడ్డారు.



ఐలవరం జిల్లా పరిషత్ హైస్కూల్

విదేశీ విద్యార్థులతో వర్చువల్ క్లాసులు



రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా విద్యార్థులను వర్చువల్ క్లాసుల ద్వారా ఇతర దేశాల విద్యార్థులతో మాట్లాడించడం, పెన్‌పాల్ విధానం ద్వారా ఉత్తర ప్రత్యుత్తరాలు విద్యార్థులచే నిర్వహిస్తున్నాం. వర్చువల్ క్లాసుల నిర్వహణకై దాతలు ముందుకు వచ్చి పరికరాలు, కుర్చీలు, విద్యార్థులకు ప్రత్యేక దుస్తులు అందజేశారు. ఇప్పటి వరకు 92 దేశాలతో వర్చువల్ క్లాసులు, 15 దేశాలతో పెన్‌పాల్ (ఉత్తర ప్రత్యుత్తరాలు) నిర్వహించాము. 2017 నుంచి ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం.

–పచ్చారు హరికృష్ణ, ఆంగ్లోపాధ్యాయులు, ఐలవరం

ఉపాధ్యాయుల సమష్టి కృషితో సత్ఫలితాలు



ఉపాధ్యాయుల సమష్టి కృషితో హైస్కూల్ ప్రగతి పథంలో నడుస్తుంది. ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ వారిని చదివించేలా చూడడం జరుగుతుంది. మా హైస్కూల్‌కు కనగాల, భట్టిప్రోలు ప్రాంతాల నుంచి విద్యార్థులు వచ్చి విద్యాభ్యాసం చేస్తున్నారు.

–మాచర్ల మోహన్‌రావు, ప్రధానోపాధ్యాయులు, ఐలవరం

జగన్ మామ సమక్షంలో మాట్లాడటం నా అదృష్టం



మాజీ సీఎం జగన్ మామయ్య సమక్షంలో ఇంగ్లీషులో మాట్లాడే అవకాశం దక్కడం మరువరానిది. హైస్కూల్‌లో ఇంగ్లీష్ పట్ల ఉన్న ఫోబియాను తొలిగించేందుకు మా మాస్టారు పచ్చారు హరికృష్ణ ఎంతగానో కృషి చేస్తున్నారు. ఆయన ఇచ్చిన తర్ఫీదు వల్లే నాకు ఈ అవకాశం వచ్చింది. నాసా గురించి కేవలం పుస్తకాల్లో చదువుకున్నాం.కొన్ని వీడియోలు కూడా చూడటం జరిగింది. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన నాసా శాస్త్రవేత్త, టెక్నాలజిస్ట్ జిమ్ ఆడమ్స్‌తో నేరుగా మాట్లాడటం తన జీవితంలో మరచిపోలేని విషయం.

–రాయన సాయినాగశ్రీ, 9వ తరగతి విద్యార్థిని, ఐలవరం జెడ్పీహైస్కూల్

క్లుప్తంగా

విద్యుత్ బిల్లుల చెల్లింపునకు ఏర్పాట్లు

భట్టిప్రోలు: విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం రేపల్లెలోని విద్యుత్ రెవెన్యూ కార్యాలయంలో ఆదివారం సైతం బిల్లులు చెల్లించే ఏర్పాటు చేయడం జరిగిందని భట్టిప్రోలు విద్యుత్ సబ్ స్టేషన్ ఇన్‌చార్జ్ ఏఈ పి.ఏడుకొండలు శనివారం తెలిపారు. వినియోగదారులు ఆన్‌లైన్, మొబైల్ యాప్ ద్వారా సులభంగా విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చునని పేర్కొన్నారు. బిల్లులు సకాలంలో చెల్లించి సహకరించాలని కోరారు.

వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రాజీనామా

కొల్లూరు : వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సూర్యదేవర రామకృష్ణ తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు శనివారం ప్రకటించారు. వ్యక్తిగత కారణాల వల్ల తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు చెప్పారు. భవిష్యత్తులో ఏ రాజకీయ పార్టీలోనూ కొనసాగే ఉద్దేశ్యం లేదని ప్రకటించారు.

నేడు మెగా మెడికల్ క్యాంపు

వేమూరు: చావలి గ్రామంలోని శివాలయం వద్ద మెగా మెడికల్ క్యాంపు నిర్వహించడం జరుగుతుందని శ్రీ శబరి వృద్ధాలయం నిర్వాహకులు తెలిపారు. వేమూరు మండలంలోని చావలి గ్రామంలోని శివాలయం వద్ద ఆదివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మెడికల్ క్యాంప్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ మెడికల్ క్యాంప్ రెయిన్ బో ట్రస్ట్ తెనాలి వారు నిర్వహించడం జరుగుతందన్నారు. అన్ని వ్యాధులకు సంబంధించిన వైద్యులు రావడం జరుగుతుందన్నారు. రోగులంతా మెడికల్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్లు సీజ్

కొల్లూరు : ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్లను కొల్లూరు పోలీసులు సీజ్ చేసిన ఘటన శనివారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..మండలంలోని పెసర్లంక కృష్ణానది నుంచి అక్రమంగా ఇసుక రవాణా జరుగుతుందన్న సమాచారంతో ఎస్ఐ రవీంద్రరెడ్డి సిబ్బందితో కలసి దాడులు చేపట్టారు. అనుమతులు లేకుండా కొల్లూరు ప్రాంతంలో ఇసుక లోడ్‌తో వెళుతున్న మూడు ట్రాక్టర్లను గుర్తించిన ఎస్ఐ ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించి కేసులు నమోదు చేశారు.

జులై1న ఉచిత వైద్య శిబిరం



తెనాలి: డాక్టర్స్ డే సందర్భంగా రెయిన్‌బో ట్రస్ట్, తెనాలి, డాక్టర్ లతాస్ డయాబెటిక్ కేర్ సంయుక్త ఆధ్వర్యంలో జులై ఒకటో తేదీన ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్టు డాక్టర్ డి.జీవనలత తెలియజేశారు. ప్రకాశం రోడ్డులోని లతాస్ డయాబెటిక్ కేర్‌లో నిర్వహించే శిబిరానికి సంబంధించిన కరపత్రాన్ని శనివారం ఆవిష్కరించి వివరాలను తెలిపారు. వైద్య శిబిరంలో బ్లడ్ షుగర్, థైరాయిడ్ స్క్రీనింగ్ పరీక్షలను ఉచితంగా చేసి, అవసరమైన మందులను ఉచితంగా ఇస్తామని తెలిపారు. స్త్రీలకు సంబంధించిన అన్ని వ్యాధులకు ఉచితంగా కన్సల్టేషన్, మందులు ఇవ్వనున్నట్టు వివరించారు. తెనాలి, పరిసరాల్లోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యార్థులకు జామెట్రీ బాక్సుల పంపిణీ



తెనాలిరూరల్: మండలంలోని బుర్రిపాలెం గ్రామానికి చెందిన శ్రీ సర్వదేవ పరంజ్యోతి మానవ సేవా సమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు జామెట్రీ బాక్సులను శనివారం పంపిణీ చేశారు. గ్రామంలోని ఘట్టమనేని నాగరత్నమ్మ రాజా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 130 మంది విద్యార్థులకు బాక్సులను అందజేశారు. సమితి సభ్యులు, ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

ఉపాధ్యాయుడు చంద్రశేఖర్‌కు డాక్టరేట్

చుండూరు(తెనాలి): బాపట్ల జిల్లా చుండూరు మండల గ్రామం మోదుకూరులోని వేమన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీష్)గా పనిచేస్తున్న మాదాసు చంద్రశేఖర్‌కు ఆచార్య నాగార్జున యూనివర్శిటీ డాక్టరేట్ లభించింది. 'మెటా–కాగ్నిస్, అచీవ్‌మెంట్ మోటివేషన్ ఆఫ్ సెకండరీ స్కూల్ పీపుల్స్ ఇన్ రిలేషన్ టు అకడెమిక్ అచీవ్‌మెంట్' అనే అంశంపై సమర్పించిన పరిశోధనకు యూనివర్శిటీ ఎడ్యుకేషన్ విభాగం నుంచి డాక్టరేట్‌ను అందుకున్నారు. డాక్టర్ జేఆర్ ప్రియదర్శిని మార్గ నిర్దేశనంలో ఈ పరిశోధన చేశారు. వేమన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.వెంకటేశ్వర్లు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

అంగన్‌వాడీ కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచండి

కొల్లూరు : అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులు కాలానుగుణ వ్యాధులకు గురి కాకుండా పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వడం ముఖ్యమని ఐసీడీఎస్ అనంతవరం సెక్టార్ ఇన్‌చార్జి సూపర్‌వైజర్ నగరాజకుమారి అన్నారు. శనివారం అనంతవరంలో నిర్వహించిన సెక్టార్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రాల పరిసరాలలో మురుగు నిల్వ ఉండకుండా చూడటంతో పాటు దోమల వ్యాప్తిని అరికట్టేందుకు అవసరమైన పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రత్యేక అవసరాల రిసోర్సు పర్సన్ ధనరాజ్ మాట్లాడుతూ ఏడాది దాటిన ప్రత్యేక అవసరాలు గల పిల్లల సమాచారం తప్పనిసరిగా తమకు అందజేయడంతో పాటు మండల కేంద్రంలోని ప్రత్యేక అసరాల చిన్నారుల కేంద్రంలో వారికి అవసరమైన వైద్య సేవలు అందజేయడానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచనలిస్తున్న అధికారులు

సీపీఎం సీనియర్ నాయకుడు కామ్రేడ్ నిమ్మగడ్డ మృతి

నివాళులు అర్పించిన పార్టీ నాయకులు

అక్కివారిపాలెం(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం పెదపులివర్రు పంచాయతీ పరిధిలోని అక్కివారిపాలెంకు చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు కామ్రేడ్ నిమ్మగడ్డ రామస్వామి(102) శనివారం ఉదయం మృతి చెందారు. ఈయనకు ఇరువురు కుమారులు, ఇరువురు కుమార్తెలు ఉన్నారు. ఆయన భౌతిక కాయానికి నాయకులు పార్టీ జెండాను కప్పి నివాళులు అర్పించారు. సీపీఎం పార్టీ బాపట్ల జిల్లా కమిటీ సభ్యులు టి.కృష్ణమోహన్ మాట్లాడుతూ రామస్వామి మృతి పార్టీ ఉద్యమానికి తీరని లోటు అని అన్నారు. లంక భూముల పోరాటంలో కామ్రేడ్ చల్లపల్లి నారాయణరావుతో కృష్ణాజిల్లా దివి సీమ తాలూకా ఉద్యమంలో పాల్గొన్నారని తెలిపారు. అక్కివారిపాలెంలో నారాయణరావు జ్ఞాపకార్థం అమరవీరుల స్థూపాన్ని నిర్మించేందుకు ఆయన చేసిన కృషి మరువలేనిదని తెలిపారు. నివాళులు అర్పించిన వారిలో భట్టిప్రోలు, కొల్లూరు మండలాల నాయకులు వేములపల్లి వెంకట్రామయ్య, జి.సుధాకర్, జి.నాగరాజు, పి.అహరోను, డేవిడ్, రాంబాబు, పి.మనోజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.



నిమ్మగడ్డ భౌతిక కాయం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు

మలేరియా రహిత సమాజ స్థాపనకు కృషి

సహాయ మలేరియా అధికారి ప్రభాకర్‌రెడ్డి

తెనాలిఅర్బన్: మలేరియా రహిత సమాజ ఏర్పాటులో ప్రజలందరూ భాగస్వాములు కావాలని తెనాలి సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర్‌రెడ్డి కోరారు. మలేరియా మాసోత్సవాల ముగింపు ర్యాలీని పట్టణంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా మలేరియా నియంత్రణకు పోరాటాలు జరుగుతున్నాయని చెప్పారు. 2027 నాటికి మలేరియా కేసులు '0' కు వచ్చే విధంగా ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. 2030 నాటికి దేశంలో మలేరియాను పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యమని వివరించారు. ప్రతి సంవత్సరం జూన్ మాసంలో మలేరియా వ్యతిరేక మాసంగా జరుపుతున్నట్లు తెలిపారు. నెల రోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో పట్టణ, మండల మలేరియా సబ్ యూనిట్ అధికారులు శ్రీకంఠ ఉమాకాంత్, వంగల పున్నారెడ్డి, హెల్త్ ఇన్‌స్పెక్టర్ జి.రవికుమార్, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, మార్త గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ సెక్రటరీ యనమల ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ చేపడుతున్న అధికారులు, సిబ్బంది

పలకలూరు రోడ్డులో లారీ చోరీ

గుంటూరు ఈస్ట్: రోడ్డుపక్కన నిలిపి ఉన్న లారీ చోరీకి గురైన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అన్వర్‌బాషా అనే లారీ డ్రైవర్ జనవరి నెలలో లారీని పలకలూరు రోడ్డులో నిలిపి ఇంటికి వెళ్లాడు. 20 రోజుల తరువాత వచ్చి చూడగా లారీ కనిపించ లేదు. లారీ కోసం వెతికి చోరీకి గురైనట్లు నిర్ధారించుకుని శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విత్తనశుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలి



తెనాలిరూరల్: రైతులు విత్తనశుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి జి.ప్రేమ్‌సాగర్ తెలిపారు. మండల గ్రామం పెదరావూరులోని రైతు భరోసా కేంద్రంలో సబ్సిడీపై రైతులకు అందజేస్తున్న వరి విత్తనాలను సర్పంచ్ కాకి రమాదేవి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏవో రైతులకు పలు సూచనలు చేశారు. కిలో విత్తనాలకు మూడు గ్రాముల కార్బెండిజమ్ లేదా ఎనిమిది గ్రాముల సూడోమోనాస్‌లో కలిపి 24 గంటల అనంతరం చల్లుకోవాలని సూచించారు. వెద పద్ధతి ద్వారా వరి సాగు చేయడం మేలని చెప్పారు. రైతు భరోసా కేంద్రాల సేవలను వినియోగించుకోవాలన్నారు. పాలడుగు సురేంద్ర, జాస్తి నరేంద్రనాథ్, వీఏఏలు, రైతులు, గ్రామ కార్యదర్శి కె.రామ సుబ్బారావు పాల్గొన్నారు.

పిచ్చి మొక్కలు తొలగించండి

మున్సిపల్ కమిషనర్ శేషన్న

తెనాలిఅర్బన్: పిచ్చి మొక్కలను వెంటనే తొలగించి ఆహ్లాదకరంగా ఆవరణను తయారు చేయాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. రజక చెరువు వద్ద ఉన్న పార్కును శనివారం ఆయన పరిశీలించారు. పార్కును శుభ్రంగా ఉంచడంతో పాటు వాకర్స్‌కు అనుకూలంగా ఉంచాలన్నారు. వారికి ఎటువంటి ఇబ్బంది కలుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట హార్టికల్చర్ అధికారి శేషబాబు, పలువురు మున్సిపల్ ఉద్యోగులు ఉన్నారు.

పరుచూరి రాఘవేంద్రరావుకు నివాళి



తెనాలి: పట్టణంలోని శ్రీ అరవింద ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు, విశ్రాంత ప్రిన్సిపాల్ పరుచూరి రాఘవేంద్రరావు సంస్మరణ సభ శనివారం సాయంత్రం శ్రీ అరవింద విద్యాకేంద్రం ప్రాంగణంలోని ధ్యాన మందిరంలో నిర్వహించారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ విద్యావేత్తగా రాఘవేంద్రరావు సమాజ హితం కోసం పని చేశారని చెప్పారు. సభకు అధ్యక్షత వహించిన చైతన్య వేదిక అధ్యక్షుడు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి మాట్లాడుతూ రాఘవేంద్రరావు ఉత్తమ విలువలతో జీవించిన ఆదర్శమైన వ్యక్తిగా కొనియాడారు. అరవింద విద్యాకేంద్రం డైరెక్టర్ కె.సంపూర్ణ, ప్రొఫెసర్ కొడాలి రాంబాబు, డాక్టర్ పాలడుగు ఉమా మహేశ్వరరావు, మొవ్వా సత్యనారాయణ తమ ప్రసంగాల్లో రాఘవేంద్రరావుతో తమకు గల అనుబంధాన్ని స్మరించుకున్నారు. తొలుత రాఘవేంద్రరావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. యడ్ల మోహనరావు, వి.నాగమల్లేశ్వరి, వై.పద్మశ్రీ,, ఆర్.నిర్మలాకుమారి, రాఘవేంద్రరావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం



భట్టిప్రోలు: భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని వాటర్ స్టోరేజ్ సంపును శుభ్రం చేసి క్లోరినేషన్ చేయడం వల్ల తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడిందని గ్రామ సర్పంచ్ దారా రవి కిరణ్మయి శనివారం తెలిపారు. దీంతో అద్దేపల్లి, కూరగాయల మార్కెట్, భట్టిప్రోలు దళితవాడలోని రక్షిత పథకాలకు నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడిందని పేర్కొన్నారు. ఆదివారం ఉదయం యథాతథంగా తాగునీరు సరఫరా అవుతుందని ప్రజలు సహకరించాలని కోరారు.

ఉపాధ్యాయులు జాతి నిర్మాతలు



కర్లపాలెం: ఉపాధ్యాయులు జాతి నిర్మాతలని ఎంపీపీ యారం వనజ అన్నారు. కర్లపాలెం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తున్న బి.మాధవరావు శనివారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు మాధవరావు దంపతులకు ఎంపీపీ యారం వనజ, ఎంపీడీవో నేతాజీ చేతుల మీదుగా సన్మానించి వీడ్కోలు పలికారు. యారం వనజ మాట్లాడుతూ విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దే శక్తి ఉపాధ్యాయులకు ఉందన్నారు. ఎంపీడీవో నేతాజీ మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం ఉపాధ్యాయులతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ఎస్.విజయశ్రీ,, ఉపాధ్యాయులు ఈ.పోలీస్‌రావు, ఎం.ఇందుమతి, ప్రసన్న లక్ష్మి, బి.రాజేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో 11 మంది ఎంపిక

తెనాలిఅర్బన్: దేవేశీ రిక్రూట్‌మెంట్ ప్రైవేట్ సంస్థ నిర్వహించిన క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో ఎన్ఆర్‌కే కేఎస్ఆర్ గుప్తా డిగ్రీ కళాశాల విద్యార్థులు 11 మంది ఉద్యోగాలు సాధించినట్లు ప్రిన్సిపల్ గోగినేని విజయకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్, హెచ్ఆర్ ఉద్యోగాలకు ఎంపిక జరిగినట్లు చెప్పారు. ఎంపికైన వారికి అభినందనలు తెలియజేశారు.

విద్యా సంస్థల బందు విజయవంతానికి పిలుపు

రేపలె రూరల్: విద్యా వ్యవస్థలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోరుతూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ)ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా జూలై 4న తలపెట్టిన విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి ఎం.సూర్యప్రకాష్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా నీట్ పరీక్షా పత్రం లీకేజీతో దేశవ్యాప్తంగా వైద్య విద్యార్థులు నష్ట పోవటం జరిగిందన్నారు. దేశ వ్యాప్తంగా సుమారు 61 వేల ప్రభుత్వ రంగ పాఠశాలలను మూసి వేశారన్నారు. ఈ నేపథ్యంలో ప్రైవేట్ విద్యారంగం విచ్చలవిడిగా పెరగటంతో ప్రభుత్వ విద్యా వ్యవస్థలు దెబ్బతింటున్నాయన్నారు. వివిధ యూనివర్సిటీల్లో ప్రశ్నిస్తున్న విద్యార్థులపై అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తివేయాలన్నారు. నీట్ పేపర్ లీకేజికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలన్నారు. ఆయా సమస్యల పరిష్కారం కోరుతూ జులై 4న జరిగే విద్యాసంస్థల బంద్‌లో విద్యా సంస్థలన్నీ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రేపల్లె డివిజన్ ఉపాధ్యక్షుడు వై.నవీన్ కుమార్, సహాయ కార్యదర్శి వై.నాగార్జున, పి.ప్రవీణ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి సూర్యప్రకాష్

లోక్ అదాలత్‌తో కక్షిదారులకు మేలు

తెనాలిరూరల్: కేసుల సత్వర పరిష్కారం కోసం లోక్ అదాలత్ చక్కటి వేదిక అని, తద్వారా కక్షిదారుల సమయం, ధనం ఆదా అవుతుందని 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి డి. శ్రీనివాసులు చెప్పారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశానుసారం, రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సూచనల మేరకు శనివారం స్థానిక న్యాయస్థానంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు ఎం. శ్రీధర్, పవన్‌కుమార్, పి.రాజశేఖర్ మాట్లాడుతూ ప్రస్తుతం నమోదు అవుతున్న కేసుల్లో చాలా వరకు కూర్చొని మాట్లాడుకుంటే పరిష్కారం అవుతాయని కాని కక్షిదారులు అనవసరమైన భేషజాలకు వెళ్లి సమయాన్ని, ధనాన్ని వృథా చేసుకుంటున్నారని అన్నారు. న్యాయస్థానంలో కేసులు జరిగితే ఎవరో ఒక్కరే విజయం సాధిస్తారని, అదే మధ్యవర్తిత్వం ద్వారా లోక్ అదాలత్ నందు రాజీ పడితే ఇరుపక్షాలు విజయం సాధిస్తారని పేర్కొన్నారు. ఈ లోక్ అదాలత్‌లో 33 సీవీలు, 73 క్రిమినల్, 11 ప్రిలిటిగేషన్, మోటారు వాహన ప్రమాద కేసులు ఏడు కలిపి పరిష్కారమయ్యాయి. బాధితులకు రూ.మూడు కోట్లు పరిహారం కింద అందించారు. ప్రభావతి, ఎ.కిషోర్, ఖాదర్‌హుస్సేన్, ఆర్.దయాకిరణ్ అదాలత్ మెంబర్లుగా వ్యవహరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్, న్యాయవాదులు, కక్షిదారులు, పోలీసులు, న్యాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



కక్షిదారులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీనివాసులు